


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 173 శనివారం 27 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

## తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ

**బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిటీ సిఫార్సు**

**42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నెంబర్ 9 విడుదల**

**సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలి: హైకోర్టు**






హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ శుక్రవారం సాయంత్రం జీవోను విడుదల చేసిం డెడికేటెడ్ కమిటీ సిఫార్సుల మేరకు బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నెంబర్ 9ని విడుదల చేసింది.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించింది. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గడువు విధించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల కోసం జీవో జారీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

# భారత ఫార్మాకు ట్రంప్ షాక్..

## మందులపై 100 శాతం సుంకాలు!



2లో.

- ఔషధాల దిగుమతిపై 100 శాతం సుంకం విధించనున్నట్టు ట్రంప్ ప్రకటన
- అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనలు
- అమెరికాలో ప్లాంట్లు నిర్మించే కంపెనీలకు సుంకాల నుంచి మినహాయింపు
- ట్రంప్ నిర్ణయంతో భారత ఫార్మా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం
- భారత ఫార్మా కంపెనీల ఆదాయంలో సింహభాగం అమెరికా మార్కెట్ నుంచే

# రాష్ట్ర కొత్త డీజీపీ శివధర్‌రెడ్డి

## అక్టోబర్ 1న బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ పోలీస్ డైరెక్టర్ జనరల్(డీజీపీ)గా రాష్ట్ర నిఘా విభాగం డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. సాంకేతికంగా ఆయనకు పోలీస్‌కోఆర్డినేషన్, డీజీపీ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు మిగతా 2లో.

# పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు

## లోతట్టు ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తం

**రోడ్లన్నీ జలమయం..వాహనదారులకు అవస్థలు**

**ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల**

**భద్రాద్రిలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**

హైదరాబాద్**సెప్టెంబర్ 26, జర్నలిస్ట్ జర్నీ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. కాలనీలను వరద నీళ్లు ముంచెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాంగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లా సింగూరు నుంచి నీటిని భారీ స్థాయిలో కిందకు వదలడంతో మిగతా 2లో.



# ఎల్ అండ్ టీపై పగ

**సీఎం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం**

**ఆ సంస్థకు కేటాయించిన భూములపై కన్నేసిన ముఖ్యమంత్రి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** సీఎం రేవంత్ రెడ్డి కక్షకట్టి మెట్రో నుంచి ఎల్ అండ్ టీని బయటికి పంపించడంతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో బీఆర్ఎస్ ను అప్రతిష్టపాలు చేసేందుకు ఎల్ అండ్ టీ సహకరించకపోవడంతో ఆ సంస్థపై ముఖ్యమంత్రి పగబట్టారని ఆయన ఆరోపించారు. ఆ సంస్థకు ఒఆర్ఆర్ చుట్టుపక్కలా కేటాయించిన 280 ఎకరాల భూమిపై సీఎం, ఆయన అనుచరుల కన్నుబడిందని దుయ్యబట్టారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థను వేధించి నిష్క్రమించేలా చేశారన్నారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దుతో మొదలుపెట్టి ఆ సంస్థను నానా రకాలుగా వేధించారని తెలిపారు. మిగతా 2లో.



# జూబ్లీహిల్స్ బరిలో మాగంటి సునీత..

## బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్

**దివంగత మాగంటి గోపీనాథ్ అర్ధాంగి సునీతకు టికెట్**

**మాగంటి సేవలకు గుర్తింపుగా కుటుంబానికే అవకాశం**



2లో.

# దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల దోషి అసదుల్లా అక్తర్ ఉరిశిక్షపై సుప్రీంకోర్టు స్టే

- ఉరిశిక్ష అమలుపై తాత్కాలికంగా స్టే విధించిన సుప్రీంకోర్టు
- నిందితుడి ప్రవర్తన, మానసిక స్థితిపై నివేదికలు కోరిన ధర్మాసనం
- ఎనిమిది వారాల్లోగా నివేదికలు ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- తదుపరి విచారణను 12 వారాలకు వాయిదా వేసిన కోర్టు



2లో.

# కాళేశ్వరం కేసులో రంగంలోకి సీబీఐ బృందాలు!

- కీలక నివేదికలు ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ
- జస్టిస్ పీసీ ఘోష్, ఎన్‌డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికల సేకరణ
- నివేదికల పరిశీలన తర్వాత ప్రాథమిక విచారణపై నిర్ణయం
- కేసు నమోదుకు కేంద్రం, గవర్నర్ అనుమతులు కీలకం



# సింగరేణి సహా కోల్ ఇండియా కార్మికులకు రూ. 1,03,000 ప్రోత్సాహకం

**వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**మొత్తం 2.47 లక్షల మంది కార్మికులకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకం**

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** సింగరేణి ఉద్యోగులకు కోల్ ఇండియా దసరా బోనస్‌ను ప్రకటించింది. ఉద్యోగుల పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.



మిగతా 2లో.

# భారత ఫార్మాకు ట్రంప్ షాక్..

## మందులపై 100 శాతం సుంకాలు!

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఫార్మా రంగానికి భారీ షాక్ ఇచ్చేలా సంచలన నిర్ణయం తీసుకున్నారు. బ్రాండెడ్, పేటెంట్ పొందిన ఔషధాల దిగుమతిపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. అయితే, అమెరికాలో తయారీ ప్లాంట్లను నిర్మిస్తున్న కంపెనీలకు ఈ సుంకాల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ ప్రకటన చేశారు. "అమెరికాలో ఫార్మాస్యూటికల్ తయారీ ప్లాంట్‌ను నిర్మించని ఏ కంపెనీ దిగుమతి చేసుకున్నా, 2025 అక్టోబర్ 1 నుంచి 100 శాతం సుంకం విధిస్తాం. ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించినా లేదా నిర్మాణంలో ఉన్నా ఈ సుంకాలు వర్తించవు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దేశీయ తయారీని ప్రోత్సహించడం, ప్రభుత్వ బడ్జెట్ లోటును తగ్గించడంతో పాటు జాతీయ భద్రత కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. ఔషధాలతో పాటు కిచెన్ కేబినెట్లు, ఫర్నిచర్, భారీ ట్రక్కుల వంటి ఇతర వస్తువులపైనా ఆయన దిగుమతి సుంకాలను పెంచారు. ఈ నిర్ణయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఎందుకంటే భారత ఫార్మా ఉత్పత్తులకు అమెరికానే అతిపెద్ద ఎగుమతి మార్కెట్. ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకారం, 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి జరిగిన మొత్తం 27.9 బిలియన్ డాలర్ల ఫార్మా ఎగుమతుల్లో సుమారు 31 శాతం, అంటే 8.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 77,231 కోట్లు) విలువైన ఉత్పత్తులు అమెరికాకే వెళ్లాయి. అమెరికాలో వినియోగించే జెనరిక్ మందుల్లో 45 శాతానికి పైగా భారత్ నుంచే సరఫరా అవుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్ లైఫ్‌సైన్సెస్ వంటి అనేక ప్రముఖ భారతీయ కంపెనీలు తమ ఆదాయంలో 30 నుంచి 50 శాతం వరకు అమెరికా మార్కెట్‌పైనే ఆధారపడి ఉన్నాయి.
ప్రస్తుతానికి ఈ సుంకాలు బ్రాండెడ్, పేటెంట్ మందులకే పరిమితమని చెప్పినప్పటికీ, భవిష్యత్తులో కాంప్లెక్స్ జెనరిక్స్, స్పెషాలిటీ మందులపైనా ఈ ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఈ సుంకాల వల్ల అమెరికాలో మందుల ధరలు విపరీతంగా పెరిగి, ద్రవ్యోల్బణానికి దారితీయడంతో పాటు ఔషధాల కొరత కూడా ఏర్పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే తక్కువ లాభాలతో పనిచేస్తున్న భారత కంపెనీలకు ఈ అదనపు భారం మోయలేనిదిగా మారవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కాళేశ్వరం కేసులో రంగంలోకి సీబీఐ బృందాలు!

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న అవకతవకల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఎట్టకేలకు రంగంలోకి దిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు, ఈ కేసులో ప్రాథమిక ఆధారాల సేకరణకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే దర్యాప్తునకు సంబంధించిన కీలక సమాచారాన్ని, నివేదికలను తమకు అందించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి గురువారం సీబీఐ అధికారులు లేఖ రాసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), రాష్ట్ర విజిలెన్స్ కమిషన్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలన్నింటినీ తమకు పంపించాలని సీబీఐ తన లేఖలో కోరినట్లు సమాచారం. ఈ పరిణామంతో సీఎస్ సంబంధిత శాఖల అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సెప్టెంబర్ మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అధికారికంగా లేఖ రాసింది. గత కేసీఆర్ ప్రభుత్వం సీబీఐ విచారణలకు అనుమతి నిరాకరిస్తూ జారీ చేసిన జీవో 51ని పక్కనపెట్టి, కేవలం కాళేశ్వరం కేసుకు మినహాయింపునిస్తూ రేవంత్ సర్కారు జీవో 104ను విడుదల చేసింది.ప్రభుత్వం నుంచి అందే నివేదికలను సీబీఐ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వాటిలో నేరాన్ని నిరూపించే ప్రాథమిక సమాచారం ఉందని నిర్ధారణకు వస్తే, న్యాయవిభాగం సలహా తీసుకుని ప్రాథమిక విచారణ (పీఈ) నమోదు చేస్తారు. ఈ కేసులో పలువురు ప్రభుత్వ అధికారులు, ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఉన్నందున పూర్తిస్థాయిలో కేసు నమోదు చేయడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు ప్రారంభించాలంటే కేంద్రం నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా, ప్రజాప్రతినిధులపై కేసు నమోదు చేయాలంటే గవర్నర్ అనుమతి కూడా అవసరం. ఈ చట్టపరమైన ప్రక్రియలన్నీ పూర్తయ్యాకే సీబీఐ పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎల్ అండ్ టీపై పగ

**(మొదటి పేజీ తరువాయి)**
మేడిగడ్డ విషయంలో తామే మరమ్మతులు చేస్తామని ఎల్ అండ్ టీ ముందుకురావడం రేవంత్ రెడ్డికి కంటగింపుగా మారిందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "2014లో మేము అధికారంలోకి వచ్చే నాటికి మెట్రో పనులు కేవలం 20-25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కేవలం మూడేండ్లలోనే 2017 నవంబర్ 29న ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా మొదటి దశను ప్రారంభించాం.కరోనా కష్టకాలంలోనూ సంస్థ నష్టాల్లో ఉందని భయపడితే, కేసీఆర్ మరోసారి అండగా నిలిచి, రూ.3,000 కోట్ల వడ్డీలేని రుణం (సాఫ్ట్ లోన్) మంజూరు చేసి, అందులో రూ.900 కోట్లు విడుదల చేసి మెట్రోను కాపాడారు. మా ప్రభుత్వ హయాంలో రోజుకు 5 లక్షల మంది ప్రయాణించే స్థాయికి, పీక్ అవర్స్‌లో కోచ్‌లు సరిపోనంతగా మెట్రోను అభివృద్ధి చేశాం. 69 కిలోమీటర్ల లైన్ పూర్తి చేసి, దేశంలోనే రెండో అతి పెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాం. కాంగ్రెస్ హయాంలో ఆవాస హోటల్ వరకే ఉన్న లైన్‌ను, లక్షలాది ఐటీ ఉద్యోగులు పనిచేసే మైండ్ స్పేస్ వరకు పొడిగించి, స్కైవాక్‌లు నిర్మించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాం".. అని కేటీఆర్ తెలిపారు."మేము అధికారం నుంచి దిగిపోయే ముందు, హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 400 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించాం. ఓఆర్ఆర్ చుట్టూ 160 కిలోమీటర్లు, భువనగిరి, సంగారెడ్డి,



షాద్‌నగర్, కడ్తాల్ వరకు విస్తరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపాం. అత్యంత కీలకమైన మైండ్ స్పేస్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోకు టెండర్లు పూర్తి చేసి, కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాం.
భూసేకరణ అవసరం లేకుండా, పిల్లర్లు లేకుండా భూమ్మీదనే నిర్మించేలా దీన్ని డిజైన్ చేశాం. కానీ, రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే తీసుకున్న మొదటి అనాలోచిత నిర్ణయం ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దు. నా భూములు ఉన్నాయనీ, బీఆర్ఎస్ నేతలకు లబ్ధి చేకూరుతుందని పిచ్చి పిచ్చి ఆరోపణలతో ప్రాజెక్టును రద్దు చేసి ఎల్ అండ్ టీపై మొదటి దెబ్బ వేశారు. అప్పటి నుంచే సీఎంకు, ఎల్ అండ్ టీకి మధ్య పంచాయితీ మొదలైంది"%ి% అని కేటీఆర్ అన్నారు. "మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వంపై ఒక్క రూపాయి భారం పడకుండా సొంత ఖర్చులతో రిపేర్ చేస్తామని ఎల్ అండ్ టీ ముందుకు వచ్చింది. కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అని బద్నాం చేద్దామనుకున్న రేవంత్ రెడ్డి ప్రచారానికి ఇది గండికొట్టింది. తమ రాజకీయ లబ్ధికి ఎల్ అండ్ టీ సహకరించలేదనే కోపంతో సీఎం ఆ సంస్థపై పగబట్టారు. అక్కడి నుంచి ఎయిర్‌పోర్ట్ మెట్రో వరకు ప్రతి విషయంలో ఆ సంస్థను వెంటాడి, వేధించారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో టెండర్ వేసిన ఎల్ అండ్ టీకి క్వాలిఫికేషన్ లేదని చెప్పి, తన అనుచరుడైన బాంబులేటి శ్రీనివాస్ రెడ్డి సంస్థకు పనులు కట్టబెట్టారు.
'మేడిగడ్డ కూలిపోయిందని చెప్పకుంటే బ్లాక్ లిస్టులో పెడతా' అని బెదిరించారు. ఈ కక్ష సాధింపు చర్యలు భరించలేకే 2070 వరకు లీజు ఉన్న ఎల్ అండ్ టీ సంస్థ రాష్ట్రం నుంచి వాకౌట్ చేసింది. 'తెలంగాణ రైజింగ్' అని చెప్పుకొనే సీఎం పెట్టుబడులకు స్వర్గధామమైన రాష్ట్రం నుంచి ఒక ప్రతిష్టాత్మక సంస్థ ఎందుకు పారిపోయిందో సమాధానం చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవైపు అప్పు పుట్టడం లేదని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే రూ.2.20 లక్షల కోట్లు అప్పు చేశారనీ, ఇప్పుడు దానికి తోడు రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై మోపారని కేటీఆర్ విమర్శించారు. ఎల్ అండ్ టీకి కేటాయించిన 280 ఎకరాల భూములను, ఉన్న మాల్స్ ను ఎవరెవరికి రాసిస్తారో త్వరలో చూస్తారని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి ఒక్క స్కీంలో ఒక్కో స్కాం దాగుందని విమర్శించారు. మరో కార్పొరేట్ సంస్థను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారనో నాలుగైదు రోజుల్లో బయటపెడతానని కేటీఆర్ వెల్లడించారు.

# జూబ్లీహిల్స్ బరిలో మాగంటి సునీత..

## బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్

### దివంగత మాగంటి గోపీనాథ్ అర్ధాంగి సునీతకు టికెట్

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):**
జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థిని బీఆర్ఎస్ ఖరారు చేసింది. దివంగత సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు.
మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీలో సీనియర్ నేతగా,



నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందిన గోపీనాథ్ కుటుంబానికే ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది.
పార్టీకి, జూబ్లీహిల్స్ ప్రజలకు మాగంటి గోపీనాథ్ అందించిన సేవలను గౌరవిస్తూ, ఆయన భార్యకు టికెట్ కేటాయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఈ నిర్ణయం ద్వారా మాగంటి గోపీనాథ్ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందనే బలమైన సంకేతాలను పంపినట్లయింది.

# రాష్ట్ర కొత్త డీజీపీ శివధర్‌రెడ్డి

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి శివధర్‌రెడ్డి ఉత్తర్వులను సచివాలయంలో అందుకున్నారు. ఆయనకు పోలీస్ శాఖలో అపార అనుభవంతో పాటు చిత్తశుద్ధి, నిజాయితీ, సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా పేరున్నది. శివధర్‌రెడ్డి 1994లో ఐపీఎస్ సర్వీసుకు ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలిఖాన్ గ్రామంలో జన్మించిన శివధర్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఎల్ఎల్‌బీ వరకు విద్యాభ్యాసం చేశారు. కొంత కాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. తర్వాత సివిల్ సర్వీస్ పరీక్ష రాసిన శివధర్‌రెడ్డి ఐపీఎస్ అధికారిగా పోలీస్ శాఖకు ఎంపికయ్యారు. మొదట విశాఖ జిల్లా అనకాపల్లి, చింతపల్లి ఏఎస్పీగా పోలీసు శాఖలో విధులను ప్రారంభించిన ఆయన తర్వాత గ్రేహౌండ్స్ ఏఎస్పీగా, అనంతరం నెల్లూరు, గుంటూరు, నల్లగొండ, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ నగర ట్రాఫిక్ డీసీపీగా, దక్షిణ మండలం డీసీపీగా విధులను నిర్వహించి సమర్థుడైన అధికారిగా పేరు పొందారు.ఆ తర్వాత ఇంటర్నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యాన కొసావో శాంతి పరిరక్షక దళంలో పని చేసిన ఆయన.. ఆ తర్వాత యాంటీ నక్సలైట్ నిఘా విభాగం (ఎస్ఐబీ) డీఐజీగా విధి నిర్వహణ సాగించారు. అనంతరం ఏసీబీ డైరెక్టర్‌గా పని చేసిన ఆయన 2012 నుంచి 2014 వరకు వైజాగ్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2014 జూన్ 2న తెలంగాణ కొత్త రాష్ట్రంగా అవతరించాక రాష్ట్ర తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ సమయంలోనే గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగింది. అనంతరం కొద్ది రోజుల తర్వాత కొన్ని కారణాలతో ప్రభుత్వం ఆయనను అక్కడి నుంచి ఆకస్మికంగా బదిలీ చేసింది. తెలంగాణకు బలమైన మద్దతుదారుడిగా పేరు పొందిన శివధర్‌రెడ్డిని ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయటం ఆ సమయంలో చర్చనీయాంశంగా మారింది.ఆ తర్వాత రైల్వే, రోడ్డు భద్రత విభాగం ఐజీగా నియమితులయ్యారు. అక్కడి నుంచి డీజీపీ కార్యాలయంలో కోఆర్డినేషన్ ఐజీ, అదనపు డీజీగా దాదాపు ఎనిమిదేండ్ల పాటు పని చేసిన ఆయన.. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తిరిగి నియమితులయ్యారు. అక్కడే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాకు పదోన్నతి పొందిన శివధర్‌రెడ్డి.. తాజాగా రాష్ట్ర పోలీస్ బాస్ డీజీపీగా నియమితులయ్యారు. వివిధ హోదాల్లో ఆయన పని చేస్తూ ముఖ్యంగా సీపీఐ(మావోయిస్టు) కార్యకలాపాల అణచివేతలోనూ, అజ్ఞాతంలో ఉన్న అనేక మంది తీవ్రవాదులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావటంలోనూ ప్రత్యేక కృషి సల్పారు. ఐఎస్ఐ ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో సైతం శివధర్‌రెడ్డి కీలక పాత్రను నిర్వహించారు.

# పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు

**(మొదటి పేజీ తరువాయి)**
అందోల్ మండలం అల్మాయిపేట బ్రిడ్జీ నీటిలో మునిగిపోయింది. దాంతో అల్మాయిపేట, కొన్యాల-పన్యాల, చౌటకూర్ మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. సింగూరు నుంచి పాపన్నపేట మండలంలోని ఘనపూర్‌కు నీళ్లు వస్తుండటంతో ఏడుపాయల దుర్గభవానీ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సంగారెడ్డిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోకి భారీగా వరద నీరు చేరడంతో కూరగాయా ల దుకాణాలు నీట మునిగాయి.పటాన్‌చెరులోని 65వ జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ముత్తంగి రింగ్‌రోడ్ నుంచి రుద్రారం వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మెదక్ జిల్లా దూప్ సింగ్ తాండా నీటి మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలో ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏట్ల ఎర్రవల్లి, దేవరాంపల్లి, టంగుటూరు, మోకిలా, పామేనా వాగులు ఉప్పొంగుతున్నాయి. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా కురిసిన కుండపోత వర్షంతో రహదారులు జలమయం అయ్యాయి. పరిగి నస్కల్ వాగు, బూరుగుపల్లి, మైలార్ దేవర్‌పల్లి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో స్థానిక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**ఉమ్మడి వరంగల్‌కు ఆరెంజ్ అలెర్ట్ జారీ**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ ప్రకటించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటించింది. కాగా జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద శుక్రవారం సాయంత్రం 8,35,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దాంతో 85 గేట్లను ఎత్తి అంతే నీటిని కిందికి వదులుతున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు 15.280 మీటర్లకు చేరుకొని వరద ప్రవహిస్తుంది. దాంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద ఇదేవిధంగా పెరుగుతూ 17.33 మీటర్లకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బ్యారేజీలోకి 8.35 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నీటి మట్టం 83 మీటర్లకుగాను 82.85 మీటర్లకు వరద చేరింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని బెగులూరు గ్రామానికి చెందిన మంద లక్ష్మి ఇంటి గోడ ప్రమాదవశాత్తు కూలిపోగా లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది.

**హైదరాబాద్‌లో రోడ్లపై భారీ వరద నీరు**
ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లపై భారీగా వరద నీరు చేరింది. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, సికింద్రాబాద్, యూసఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు చేరింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలోకి వరద నీరు చేరింది. ఆస్పత్రి ఆవరణలోని నాలా కొన్ని రోజులుగా పొంగిపొర్లుతుండటంతో భారీగా వరద నీరు వచ్చింది. దాంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై స్పందించిన జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు వెంటనే రెండు యంత్రాలతో నాలాను తవ్వి నీరు సాఫీగా వెళ్లేటట్టు చేశారు. మూసీ వరద ఉధృతితో మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో వాహనాలను నిలిచివేశారు.

# సింగరేణి సహా కోల్ ఇండియా కార్మికులకు రూ. 1,03,000 ప్రోత్సాహకం

**(మొదటి పేజీ తరువాయి)**
కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థల్లోని 2.09 లక్షల మంది కార్మికులు, సింగరేణి కాలరీస్‌లోని 38,000 మంది కార్మికుల కృషికి గుర్తింపుగా ఒక్కొక్కరికి రూ. 1,03,000 చొప్పున పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు కిషన్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఇందులో ఉద్యోగుల బీమా కవరేజీని రూ. 1 కోటికి పెంచడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచామని తెలిపారు. ఉద్యోగులు ఎలాంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. శాశ్వత ఉద్యోగులు కానివారికి కూడా బీమా రక్షణ కల్పించామని చెప్పారు.తమ నిర్ణయాలు ఉద్యోగుల సమగ్ర సంక్షేమం వైపు ఒక ముందడుగు అని కిషన్ రెడ్డి అభివర్ణించారు. ఎక్స్‌గ్రేషియాను కూడా రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలలో సీఎండీ నుంచి కార్మికుడి వరకు అందరికీ డ్రెస్ కోడ్ తీసుకువచ్చామని తెలిపారు. పండుగ సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఈ పనితీరు ప్రోత్సాహకం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు.

# దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల దోషి అసదుల్లా అక్తర్ ఉరిశిక్షపై సుప్రీంకోర్టు స్టే

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన అసదుల్లా అక్తర్‌కు విధించిన మరణశిక్ష అమలుపై సుప్రీంకోర్టు గురువారం తాత్కాలికంగా స్టే విధించింది. కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అక్తర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. నిందితుడికి సంబంధించిన పలు అంశాలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది.
జైలులో అక్తర్ ప్రవర్తన, అతడికి అప్పగించిన పనుల గురించి జైలు సూపరింటెండెంట్, ప్రొబేషన్ అధికారులు నివేదిక ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా, అక్తర్ మానసిక స్థితిపై ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నివేదిక తీసుకోవాలని సూచించింది. ఈ నివేదికలన్నింటినీ ఎనిమిది వారాల్లోగా తమకు సమర్పించాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను 12 వారాలకు వాయిదా వేసింది.

# స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భ్రమరాంబిక అమ్మవారు






**ఐనవోలు/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన ఆవరణలో గల భ్రమరాంబిక అమ్మవారి దేవాలయ లో దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఐదవ రోజు అమ్మ వారు స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనం మిచ్చారు. నిత్యాహ్నికము, నవావర్ణార్చన, బావనోపనిషత్పారాయణము చండీ సప్తశతి పారాయణం, చండీహవనం (చండీ హెూమం) కార్యక్రమం నిర్వహించడం జరిగినదనిదేవాలయ కార్యనిర్వహణాధికారి కందుల సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కమ్మగాని ప్రభాకర్ గౌడ్,ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తం శర్మ,విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, మధు శర్మ,శ్రీనివాస్, నరేష్ శర్మ, దేవేందర్, భక్తులు అర్చక సిబ్బంది ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ

## -ఐలమ్మ స్ఫూర్తిగాకాంగ్రెస్ పార్టీ ఆరు హామీలపై ప్రశ్నించాలి. -మాజీ ఎమ్మెల్యే హరిప్రియ.

**బయ్యారం/సెప్టెంబర్ 26( జర్నలిస్ట్ వార్త):** నాటి తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, చిట్యాల (చాకలి) ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి ఆమె ప్రతీక అని,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలపై ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని పోరాటం చేయాలని బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అన్నారు.శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా గంధంపల్లి గ్రామపంచాయతీలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని స్మరించుకున్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని పేర్కొన్నారు.ఐలమ్మ పోరాట స్ఫూర్తితో



తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం బిఆర్ఎస్ పార్టీ కృషి సాగిస్తున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్,బానోత్ మురళి కృష్ణ,గంగుల సత్యనారాయణ,ఏనుగుల ఐలయ్య,ఇర్ప మమత,బానోత్ లక్ష్మణ్,సింగారం శ్రీను,జర్పుల శ్రీను,వంకుడోత్ జగన్,దాసరి రాము,ఇస్లావత్ వీరన్న,దేవోజీ తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మించి వైరా సబ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

**వైరా/సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** అసిస్టెంట్ ఇంజనీరింగ్ వారి కార్యాలయం నందు నూతనంగా నిర్మించిన ఇంటర్ లింకింగ్, ఇన్%ఒ%ఔట్ కొత్త లైన్ ఛార్జింగ్ను రిబ్బన్ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా పట్టణంలోని కరెంటు సమస్యలు విపరీతంగా వస్తున్న సందర్భంగా గతంలో తల్లాడ నుంచి సప్లై తీసుకోవడం జరుగుతుంది తద్వారా అనేక టెక్నికల్ ఇష్యూలు రావడం వల్ల కరెంటు అంతరాయం కలుగుతుంది అంతరాయం కలగకుండా ఇప్పుడు నూతనంగా కుర్నవల్లి, కొణిజర్ల, మీదగా మరో కొత్త ఛార్జింగ్ లైన్లను అనుసంధానం చేసే కరెంటు అంతరాయాన్ని అధిగమించెదగమించినందుకు ముఖ్యంగా సిబ్బందికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. నిరంతరం ప్రజలకు కరెంటు అందించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుండి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ప్రజలకు ఎక్కడ విద్యుత్తుల అసౌకర్యం కలగకుండా నిరంతరం ప్రజలకు కరెంటు అందించాలని సిబ్బందిని కోరుతూ నిరంతరం అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ తో పాటు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్



అందించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని ప్రజలకు అందిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, మార్క్ ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, రాంపూడి రోశయ్య, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, బిడికె రత్నం, మచ్చ బుజ్జి, పాలేటి నరసింహారావు, దర్నా రాజశేఖర్, శీలం చంద్రశేఖర్ రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, నార్వనేని అశోక్, జవ్వాజి నాగరాజు, తెళ్ళూరి వీరయ్య, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, మెరుగు వెంకట్, రావూరి అజయ్, మరియు విద్యుత్ డి ఈ బండీ శ్రీనివాస రావు, ఏ డి ఈ పోతగాని కిరణ్ కుమార్, ఏ ఈ పచ్చిగల్ల సుందర్ కుమార్, లైన్ మ్యాన్ కర్లకంటి శ్రీనివాస రావు, మరియు సిబ్బంది, ఎల్వర్లు, తదితరలు పాల్గొన్నారు.

# గ్రూప్ 1 పరీక్షలో 605 ర్యాంక్ సాధించి ఎంపిడిఓగా ఎన్నికైన నూతనపాటి కళ్యాణ్



**బయ్యారం/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** జీవితంలో కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని రుజువు చేసిన ఓ పల్లెటూరి యువకుడు నూతనపాటి కళ్యాణ్ కష్టపడి చదివి టిజీపిఎస్సి నిర్వహించిన గ్రూప్-1,2,3,4 పరీక్షల్లో ఏకంగా నాలుగు ఉద్యోగాలలో అర్హత సాధించి శభాష్ అనిపించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు.వివరాల్లోనికి వెళితే..మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం,గంథంపల్లి గ్రామానికి చెందిన నూతనపాటి శ్రీనివాసరావు సునీత దంపతుల కుమారుడు నూతనపాటి కళ్యాణ్,ఇటీవల టిజీపిఎస్సి నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో 605 ర్యాంక్ సాధించి ఎంపిడిఓ గా అర్హతసాధించారు.అంతేకాకుండ గ్రూప్ -2 పరీక్షలో 194వ ర్యాంక్ తో (ఏఎస్ఓ ) అసిస్టెంట్ స్టాటికల్చర్ ఆఫీసర్ గా,గ్రూప్- 3 పరీక్షలో 384వ ర్యాంక్ సాధించి రెవిన్యూ జునియర్ అసిస్టెంటుగా అర్హత సాధించి,తెలంగాణ పబ్లిక్ సర్విస్ కమిషన్ చరిత్రలోనే అన్ని ఫార్మట్లలో ఒకేసారి అర్హత సాధించి రికార్డు సృష్టించాడు.దీనితో కళ్యాణ్ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.కళ్యాణ్ సాధించిన విజయాల పట్ల గ్రామస్తులు,స్నేహితులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 69 శాతం రిజర్వేషన్ల ప్రకటనపై హర్షం

## -కాంగ్రెస్ నాయకులు గుంజ వీరస్వామి.



**బయ్యారం/ సెప్టెంబర్ 26( జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం, 27 శాతం ఎస్సీ, ఎస్టీలకు, మొత్తంగా 69 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు,జగ్గుతండ మాజీ ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై తీవ్ర ఉత్కంఠత నెలకొని ఉన్న సంగతి తెలిసిందే.రాష్ట్రంలో సర్పంచ్,ఎంపీటీసీల పదవీ కాలం పూర్తి అయ్యి దగ్గర దగ్గర రెండు సంవత్సరాలు కావొస్తుంది.దీనిపై హైకోర్టు మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలంటూ సెప్టెంబర్ చివరి వరకు గడువు ఇస్తూ గతంలో కోర్టు ఆదేశాలు జారీ చేసింది.హైకోర్టు ఇచ్చిన గడువు ముగిసే సమయం దగ్గర పడినా..స్థానిక ఎన్నికలపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు.ఇదిలా ఉంటే తాజాగా సీఎం రేవంత్ స్థానిక ఎన్నికల్లో 69 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు.

# పాఠ్య పుస్తకాల లో చాకలి ఐలమ్మ పోరాటాన్ని గురించి ముద్రించాలి

## వరంగల్ జిల్లా రజక వృతి దారుల సమక్యా జిల్లా కార్యదర్శి ఆరేళ్లి ప్రభాకర్

**వర్ధన్నపేట/సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** పాఠ్య పుస్తకాల లో చాకలి ఐలమ్మ పోరాటాన్ని గురించి ముద్రించాలని వరంగల్ జిల్లా రజక వృతి దారుల సమక్యా జిల్లా కార్యదర్శి ఆరేళ్లి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం చాకలి ఐలమ్మ 130 వ జయంతి సందర్భంగా వర్ధన్నపేట మండలం లోని అంబేద్కర్ స్టాచ్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ఐలమ్మ పొలం లో అమర్ధన్ నిర్మించాలి ప్రభుత్వ అధికారులే పాఠ్య పుస్తకాల లో చాకలి ఐలమ్మ పోరాటాన్ని గురించి ముద్రించాలన్నారు. అర్హులైన



రజకుల కు వారి ఉద్యోగాలను వారికి కేటాయించాలతెలిపారు. 15 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర వీర నారి ఐలమ్మకె దక్కుతుందిని, 25 వేల మంది జైలు జీవితం అనుభవించారని, 5 వేలకు పైగా తమ ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి జాగిర్ దారికి వ్యతిరేకంగా వాటంలో అమరులయ్యారు అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బొడ్డుపెల్లి సాయిలు గారు సీనియర్ నాయకుడు లొంక ఐలయ్య మండల అధ్యక్షుడు ఆరేళ్లి వెంకటయ్య ఎర్రం యాకయ్య గుడికందుల రాజు ఆరేళ్ళి సోమయ్య నేరెల్లి యాకయ్య వరంగంటి ఉప్పలయ్య కొండేటి మహేందర్ అరెల్లి కుమార్ ఎర్రం చంద్రమౌళి పెండ్యాల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## ఓబులాపూర్ సబ్ స్టేషన్లో 5ఎంవిఏ పిటిఆర్ ప్రారంభించిన డిఈ

**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త) :** విధి నిర్వహణలో విద్యుత్ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని డిఈ ఆపరేషన్ ఘనపూర్ వై రాంబాబు అన్నారు. జాఫర్గఢ్ మండల పరిధిలోని 33/11కేవి ఓబులాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలో శుక్ర వారం 5 ఎంవిఎ సామర్థ్యం కలిగిన అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్ ను డిఈ ఆపరేషన్ ఘనపూర్ వై రాంబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ డివిజన్ పరిధిలోని జాఫర్గఢ్ మండలం ఓబులాపూర్ గ్రామంలో ఉన్న 33/11కేవి విద్యుత్ ఉప కేంద్రంలో ఇంతకుముందు ఉన్న 8 ఎంవిఎ పవర్ ట్రాన్స్ఫార్మర్ కు అనుసంధానం గా మరో 5ఎంవిఎ సామర్థ్యంకలిగిన అదనపు పిటిఆర్ ఏర్పాటు చేశామని అన్నారు. దీనివల్ల ఓబులాపూర్ తో పాటు తమ్మడపల్లి(జి),ముగ్దుమ్ తండా పరిసర ప్రాంతాల్లో శాశ్వతంగా లో ఓల్టేజ్,ఓవర్లోడ్ సమస్యను నివారించామని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ మునిసి పల్ కేంద్రంతో పాటు,డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతా ల్లో నిరంతరాయ సరఫరా ఇవ్వాలానే లక్ష్యంతో ముం దుకు వెళ్తున్నామని



ఇప్పటివరకే విద్యుత్ సమస్యలు చాలా వరకు నివారించగలిగామని, ఇంకా పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈమధ్య మన బాధ్యత మరింత పెరిగిందని విద్యుత్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ ఆపరేషన్ ఘనపూర్ పి రణధీర్ రెడ్డి,ఏడిఈ, టిఆర్ఈ శ్రీధర్, ఏఈ జాఫర్గఢ్ కే విశ్వసాహితీ, ఏఈ, టిఆర్ఈ కుమారస్వామి,సబ్ ఇంజనీర్ డి వరుణ్ , సిబ్బంది ఫోర్మెన్ ఆచారి,లైన్ ఇన్స్పెక్టర్ లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ లైన్మెన్ గుర్రం కుమార్,బానోత్ వాసు ఆర్టిజ న్ పిట్టల అశోక్, గుత్తేదార్ హరీష్ తదితరులు పాల్గొ న్నారు.



# నేలకొండపల్లి మండలం లో అభివృద్ధి పనుల శంకుస్థాపన

## -క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి



**పాలేరు/సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** నియోజకవర్గం నేలకొండపల్లి మండలం అమ్మగూడెం గ్రామంలో నాలుగు కోట్ల రూపాయల తో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో రెవెన్యూ,గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లా క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి ని పరుగులు పెట్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు జరగడం లేదని ఆయన తెలిపారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పని చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,మాజీ మార్కెట్ చైర్మన్ శాఖమూరి రమేష్,కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవింద రావు,నంబూరి రామారావు,బొడ్డు బొందయ్య,మామిడి వెంకన్న,అడపాల రామారావు, రాయపూడి నవీన్,గుండా బ్రహ్మం,చిట్టెంచెట్టి వెంకటేష్,తేజావాత్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా



**ఖమ్మం బ్యూరో/సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** సైగ భాష నేర్చుకొనుటకు వాల్ పోస్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శ్రీనివాసరెడ్డి అదనపు కలెక్టర్ రెవిన్యూ ,రామ్ గోపాల్ రెడ్డి జిల్లా సంక్షేమ అధికారి ఖమ్మం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమము నందు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారము గ్రీవెన్స్ నందు బదిరి భాష తెలిసిన ఒక ట్రైనర్ను ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయము గోడమీద బదిరులకు సంబంధించిన సైగ భాష పోస్టర్ పెయింటింగ్ వేయిస్తామని తెలిపారు. అంతర్జాతీయ బదురుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నుండి బదురుల ఉద్యోగులు, నిరుద్యోగ బధిరులు వందమందికి పైగా హాజరైనారు.

## కోలేటి పుల్లారావు ఎంపీడీవో గా గ్రూప్ వన్ ఫలితాలలో ఎంపిక..



**సత్తుపల్లి/సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ కు చెందిన కోలేటి కృష్ణయ్య , పీరమ్మ దంపతుల కుమారుడు కోలేటి పుల్లారావు ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్ ఫలితాలలో ఐదో ర్యాంక్ సాధించి ఎంపీడీవో గా కి సెలెక్ట్ అయ్యారు. గతంలో ఎస్ ఎస్ సి లో ఫలితాలలో ర్యాంకు సాధించిపుల్లారావు ప్రస్తుతం సెంట్రల్ సెక్రటేరియట్ న్యూఢిల్లీ లో ఆడిటర్ గా పని చేస్తున్నాడు. కోలేటి కృష్ణయ్య ,పీరమ్మ దంపతులు కోలేటి కృష్ణయ్య రిక్షా కార్మికుడి కాగా తల్లి పేరమ్మ అంగన్వాడి ఆయాగా పని చేశారు. కృష్ణయ్య ,పీరమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు కాగా ఐదో సంతానం కుమారుడు కోలేటి పుల్లారావు. గ్రూప్ వన్ ఫలితాలలో ఎంపీడీవో గా కావటం పట్ల అంబేద్కర్ నగర్ కాలనీ ప్రజలు, కుటుంబ సభ్యులు, పలువురు రాజకీయ ప్రముఖులు పుల్లారావు ను వారి కుటుంబ సభ్యులను అభినందించారు.

## సింగరేణి ఉద్యోగులు, కార్మికులతో దుర్గా పూజ కార్యక్రమం లో పాల్గొన్న ఎంఎల్ఏ మట్టా రాగమయి..



**సత్తుపల్లి/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** కిష్టారం ఓ సి లోసింగరేణి ఉద్యోగులు, కార్మికులతో కలిసి దుర్గమ్మ పూజా కార్యక్రమం లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ శుక్రవారం పాల్గొన్నారు. సత్తుపల్లి పట్టణం-కిష్టారం ఓ సీ లో సింగరేణి జి ఎం, పి ఓ తో, సింగరేణి ఉద్యోగులు, కార్మికులతో కలిసి దుర్గమ్మ నవరాత్రులు సందర్భంగా పూజా కార్యక్రమం లో అన్నప్రాసద కార్యక్రమం లో పాల్గొని అందరికి ముందుగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సింగరేణి జి ఎం, సింగరేణి పి ఓ లు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సింగరేణి ఉద్యగులు, కార్మికులు మరియు సత్తుపల్లి పట్టణ, మండలం కాంగ్రెస్ నాయకులు, మహిళా, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిప్పు కణిక చాకలి ఐలమ్మ



**రాయపర్తి/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సాయుధ రైతాంగ సాయుధ పోరాట నిప్పు కణిక చాకలి ఐలమ్మ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం తొలి తరం సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ 130 జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్య నాయక్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి లు అయిలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని ఆమె చూపిన తెగువ ఆమె చేసిన ఉద్యమం ఎప్పటికీ మరువలేనిది అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె అందరికీ స్ఫూర్తినిచ్చిందన్నారు ఐలమ్మ పోరాట చరిత్ర చెరగని అధ్యయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో ముద్దనపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,మండల ఉపాధ్యక్షులు భూక్య అమ్మయ్య నాయక్,మండల యూత్ అధ్యక్షులు కళ్యాణ్ గౌడ్, మాజీ మండలాధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ చిర్ర ఉప్పలయ్య కాంచనపల్లి వనజారాణి ఎనగందుల మురళి ఉల్లెంగుల యాదగిరి మందాటి సుదర్శన్ రెడ్డి కోటేశ్వర్ రవి కందుకట్ల రాజయ్య యాకూబ్ తదితరులు పాల్గొన్నారు

## పందిపంపుల ఫీడర్ ను ప్రారంభించిన విద్యుత్ శాఖ ఎస్ఇ విజయేందర్ రెడ్డి



**బయ్యారం/ సెప్టెంబర్ 26( జర్నలిస్టు వార్త):** 33/11 కెవి కంబాలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి అల్లిగూడెం ఫీడర్ ఓవర్ లోడ్ కారణంగా ఇబ్బందులు పడుతున్న వేళ విద్యుత్ శాఖ నూతన 11 కెవి ఫీడర్ ను పందిపంపుల గ్రామంలో 25 లక్షల వ్యయంతో ఫీడర్ ను ఏర్పాటు చేశారు. ఈ ఫీడర్ ను శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ఎస్ఇ విజయేందర్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనూతన ఫీడర్ వల్ల 11 కెవి అల్లిగూడెం ఫీడర్ లోడు తగ్గడంతో పాటు ఓల్టేజ్ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గతంలో 11 కెవి అల్లిగూడెం ఫీడర్ మీద అల్లిగూడెం,రెడ్యా తండా ,జగత్రావుపేట,బీరోనిమడవ,కస్తూరి నగరం ,పంది పంపుల, బోటి తండా ,భీమ్లా తండా గ్రామాలు ఉండేవి. ప్రస్తుతం ఫీడర్ నీ విభజించడం వలన 11 కెవి అల్లిగూడెం ఫీడర్ మీద అల్లిగూడెం,రెడ్యా తండా ,జగత్రావుపేట,కస్తూరి నగర్ గ్రామాలు ఉన్నాయని అన్నారు. నూతన 11 కెవి పంది పంపుల ఫీడర్ తో భీమ్లా తండా తండా,పంది పంపుల,బోటి తండా, బీరోనీ మడవ గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ విజయ్, ఏడిఈ రమేష్,లోకనాథ్ రెడ్డి,ఏఇ సుమన్, ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు దసరా లక్కీ డ్రా..



**సత్తుపల్లి/సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** దసరా పండగ పురస్కరించుకొని డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి, నాన్ ఏసీ బస్సుల తో పాటు అన్ని రకాల ఏసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు బహుమతులు గెలుచుకోవచ్చని సత్తుపల్లి ఆర్టీసీ డిఎం సునీత సూచించారు. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు ప్రయాణికులు వారి టికెట్ వెనుక వారి పేరు, మొబైల్ నెంబర్ రాసి సమీపంలోని బస్టాండ్లలోని లక్కీ డిప్ బాక్స్ లలో వేయాలని కోరారు. రీజియన్ పరిధిలో రూ .50వేల బహుమతులు అందిస్తామన్నారు.

## అక్టోబర్ 6న వికలాంగుల చేయూత పెన్షన్ ధరల మహాసభను విజయవంతం చేయాలి...

### ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ



**చౌటుప్పల్/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** అక్టోబర్ 6న వికలాంగుల చేయిత పెన్షన్ ధరల మహాసభను విజయవంతం చేయాలనిఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం చౌటుప్పల్ పట్టణం లోని మార్కెట్ యార్డ్ హాల్ లో ఎమ్మార్పీఎస్, విహెచ్పిఎస్, ఎం ఎస్ పి ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగ స్వామి మాదిగ అధ్యక్షతన నిర్వహించగా. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 6 న చౌటుప్పల్ లో వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ఎంఎస్పీవీహెచ్పిఎస్ సంఘాల కార్యకర్త అభిమానులకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలని లేనియెడల మంద కృష్ణ మాదిగ ఆదేశాలనుసారం దశలవారీగా ఉద్యమాలు పోరారంభించాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారంలోకి రాక మునుపు ఇచ్చిన హామీలు మరవద్దని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల పెన్షన్ రూ 6 వేలకు పెంచి ఇస్తున్నాడు. కానీ తెలంగాణలో రూ 6 వేలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడని అన్నారు. 2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలు , మిగితా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ 4 వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ నెల ఓటు వేయండి , వచ్చే నెల పెరిగే పెన్షన్ తీసుకొండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని అన్నారు. ఇది ఘోరమైన మోసం అని అన్నారు. ఈ మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. 50 లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అందులో భాగంగా తెలంగాణ నలుమూల తిరుగుతూ అక్టోబర్ 6వ తేదీన చౌటుప్పల్ కు వస్తున్నారని అన్నారు. చౌటుప్పల్ లో చౌటుప్పల్, రామన్నపేట, పోచంపల్లి, సంస్థాన్ నారాయణపురం మండలాల పెన్షన్ దారుల సభ జరుగుతుంది అని ఈ సభకు నాలుగు మండలాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల నుండి అన్ని రకాల చేయూత పెన్షన్ దారులు మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు ఎర్ర శంకర్ మాదిగ, మండల ఉపాధ్యక్షులు చీమకండ్ల శ్రీనివాస్ మాదిగ,మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర గౌతమ్ మాదిగ,నల్ల బెల్లి గ్రామ నాయకులు రాజు మాదిగ తదితర నాయకులు పాల్గొన్నారు.

## వీర వనిత చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం.

### -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మంబ్యూరో/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద శుక్రవారం జిల్లా వెనక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సమాజంలోని అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక సంఘాలలో ఆమె స్ఫూర్తి నింపారని అన్నారు. చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా, భూ, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. చాకలి ఐలమ్మ కు గుర్తింపు అందించడంలో భాగంగా కోఠిలోని మహిళ యూనివర్సిటీకి ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు పెట్టిందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అటువంటి వీర వనితను స్మరించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేద ప్రజల భూ%ఎ% సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి తీసుకొని వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి. జ్యోతి, కార్పొరేటర్ 43వ డివిజన్ క్లైమేట్, రజక కులసంఘ నాయకులు, బిసి కుల సంఘ నాయకులు బొడ్డు ఉపేందర్, జక్కుల వెంకటరమణ, కనతాల నరసింహారావు, తుపాకుల ఎర్రగొండ స్వామి,గజ్జల్ల వెంకన్న, పడిగల కృష్ణవేణి, కృష్ణారావు, రేగళ్ల సీతారాములు, సత్తెనపల్లి శ్రీను, అన్నారపు వెంకటేశ్వర్లు, బాసటి హనుమంతరావు, మాచర్ల వేలాద్రి, మేకల సుగుణ రావు, అమర గాని వెంకటేశ్వర్లు, కూరాకుల నాగభూషణం, పేల్లూరి విజయకుమార్, కత్తి నెహ్రూ గౌడ్, దుప్పటి నగేష్, కూరాకుల నాగభూషణం, భూక్య జ్యోతి, మల్లపు సోమరాజు, దుంపటి నగేష్, మాచర్ల వేలాద్రి, బీరెల్లి సీతారాములు, దొనకొండ ముత్తయ్య, వట్టి కోట అప్పారావు, పగిళ్ల బుచ్చిబాబు, ఆరి ప్రసాద్, నెల్లుట్ల వెంకన్న, కాకులారం నరసింహారావు, అధికారులు, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు, ఖమ్మం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయం సిబ్బంది, వసతిగృహ సంక్షేమ అధికారులు రజక సంఘ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28 నుండి అక్టోబర్ 3 వరకు
# మార్కెట్ యార్డు కు సెలవు

**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్26 (జర్నలిస్ట్ వార్త) :** దసరాపండుగ సందర్భంగా ఈనెల 28 నుండి అక్టోబర్ 3 వరకు స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవులు ప్రకటించడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ఈనెల 28న ఆది వారం, 29న సోమవారం సద్దుల బతుకమ్మ పండుగ, 30న మంగళవారం దుర్గాష్టమి, అక్టోబర్ 1న బుధవారం మహార్నవమి, 2న గురువారం విజయదశ మి దసరా పండుగ, 3న శుక్రవారం దశమి పండుగ మరసటి రోజు కలిపి 6 రోజులు పాటు వ్యవసాయ మార్కెట్ బంధు ఉంటుందని తెలిపారు. బంధు ఉన్న ఆరు రోజులలో రైతులు తమ సరుకులను మార్కెట్కు తీసుకువచ్చి ఇబ్బందులు పడవద్దు అని తెలిపారు. తిరిగి అక్టోబర్4న మార్కెట్ తీయడం జరుగుతుందని రైతులు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్, మార్కెట్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## కనకదుర్గ ఆలయంలో శ్రీ లలిత దేవి అవతారంలో దుర్గాదేవి




**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో గల శ్రీ కనకదుర్గా దేవి అమ్మవారి దేవాలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవముల సందర్భంగా ఐదవ రోజు శుక్రవారం శ్రీ లలిత దేవి అవతరంలో దుర్గాదేవి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం, నిత్యహోమం,నిత్య పూర్ణాహుతి, కుంకుమార్చన తది తర పూజలు అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజల అనం తరం తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై లలిత దేవి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకున్నా రు. ఈ కార్యక్రమంలో అర్చకుడు జీడి కంటి వరుణా చార్యులు, దేవలయ ధర్మకర్తల మండలి సభ్యులు రాజేశ్వర స్వామి, పండుగ బుచ్చయ్య, కనకయ్య స్వామి,భవానిమాల దీక్ష తీసుకున్న సభ్యులు పండుగ రాజేశ్వర్,పండుగ కనకయ్య, పర్శ రాజు,పండుగ రవి, పండుగ సత్తయ్య, పండుగ గణేష్, కుంట రమేష్, శ్రీపతి రాజు, మారపాక నాగరాజు,భక్తులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీట్ సాధించిన సంధ్యారాణిని సన్మానించిన సామాజిక సేవకులు షేక్ లతీఫ్..

**తల్లాడ /సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన గొడ్ల సంధ్యారాణి ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా వైరా మండలం కేజీ సిరిపురం గ్రామానికి చెందిన సామాజిక సేవకులు షేక్.లతీఫ్ శుక్రవారం ఆమెను శాలువాలతో సన్మానించి సత్కరించారు. కొంత నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి ఎంబిబిఎస్ సీట్ సాధించటం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువులో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామ పెద్దలు మోరంపూడి మోహన్ రావు, సంధ్యారాణి తల్లిదండ్రులు బాబు, వసంత, తదితరులు ఉన్నారు.



## చిన్నారి రియాన్ష్ నీ ఆశీర్వదించిన సింగపురం ఇమ్మానియేల్ రాజ్



**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్26 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘనపూర్ మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన మారపాక హరీష్ - నవ్యల కుమారుడు రియాన్ష్ మొదటి సంవత్సర పుట్టిన రోజు వేడుకలకు స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సింగపురం ఇందిరా కుమారుడు, యువ నాయకుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ పాల్గొని చిన్నారి రియాన్ష్ నీ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా నాయకుడు తాటికొండ సంపత్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్లూరి మౌనిక , జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సింగపురం నాగయ్య,మండల ఎంపీటీ సీ ల ఫోరం మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్, సీనియర్ నాయకులు మారపాక శ్రీను, గుండె యాదగి రి, మారపాక శ్రీను(నంది), అనంతపురపు కుమార్, దామెర శ్రీను, బొల్లం నాగరాజు,చొక్కం శ్రీనివాస్, సింగ పురం ప్రతిష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు




**రాయపర్తి/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో శుక్రవారం ఎంపీటీసీ జెడ్పిటిసి సాధారణ ఎన్నికలలో భాగంగా రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు, ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులలో మండల అభివృద్ధి అధికారి జి కిషన్ నాయక్ పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, టిఓటిలు గారే కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు వినోద్, శాంతిరాజ్, రాకేష్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న పరుపాటి



**రాయపర్తి/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెరటి యాదవ రెడ్డి మనుమడి మొదటి పుట్టినరోజు వేడుకలలో శుక్రవారం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, పరుపాటి రవీందర్ రెడ్డి, లేతకుల మధుకర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, లేతకుల మహేందర్ రెడ్డి, నార్లపురం రాజు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గంటను అపహరించిన దొంగలు

### త్వరలో పట్టుకుంటాను అన్న సి ఐ



**నర్సంపేట/ సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** మాదన్నపేట్ చెరువు కట్టపై ఉన్నా , శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలోనీ గంట ను ఎవరో దుండగులు దొంగలించారు నిత్య పూజలు అందుకుని శివుని గుడిలోని గంటను అపహరించడం అటు ఆలయ కమిటీకి గాని. భక్తులకు గాని ఇబ్బందికరంగా ఉంది ప్రతిరోజు సుమారు 100 మంది భక్తులు ఉదయాన్నే మాదన్నపేట చెరువులో స్నానం ఆచరించి శివలింగాన్ని దర్శించుకునేవారు శుక్రవారం ఉదయం ఆలయంలో గంట కనబడకపోవడం వలన భక్తులు నిరాశకు గురయ్యారు ఆలయ కమిటీ సభ్యులు నర్సంపేట పోలీస్ స్టేషన్లో ఉదయం 11:30 గంటల ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా సి ఐ దొంగను త్వరలోనే పట్టుకొంటామని హామీ ఇచ్చారు.

## నా విషయం తేల్చకుంటే జీవసమాధి అవుతాను: మాజీ డీఎస్పీ నళిని

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):** వచ్చే నవమి లోపు తన విషయం తేల్చకపోతే మరణమే శరణ్యమని, జీవసమాధి అవుతానని మాజీ డీఎస్పీ నళిని అన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఆమె తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. మరణ వాంగ్మూలం పేరుతో ఆమె తన సామాజిక మాధ్యమాల్లో గత వారం రోజులగా పలు పోస్టులు పెడుతూ వస్తున్నారు. తాజాగా శు క్రవారం మరో పోస్టును విడుదల చేశారు.

## గోమాత కు ఘనంగా శ్రీమంతం



**నర్సంపేట/సెప్టెంబర్26 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట మండలం దాసరిపల్లి గ్రామంలో రైతు పెండ్యాల సురేందర్- విజయ దంపతులు తాము పెంచుకుంటున్న ఆవు కు గౌరీగా నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. తమ ఇంట్లో కుటుంబ సభ్యురాలిగా చూసుకుంటున్న ఆవు (గౌరీ) ఇటీవల గర్భం దాల్చడంతో శుక్రవారం రైతు కుటుంబం తమబంధుమిత్రులను, గ్రామస్థులను ఇంటికి ఆహ్వానించి ఆవుకు అంగరంగ వైభవంగా శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు.గోవుకు శ్రీమంతం జరపడం పట్ల పలువురు రైతును అభినందిస్తున్నారు.

## మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన దుర్గామాత




**వర్ధన్నపేట/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** మండలం కేంద్రంలోని దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చినది. అనంతరం భక్తులు అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. అర్చకులు కలకోట గోపాల్ చారి ఆధ్వర్యంలో, కలకోట శ్రావణ్,కలకోట రామాచారి, ప్రశాంత్, పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి కమిటీ సభ్యులు రాజు, నిఖిల్, రంజన్ కుమార్, సతీష్ కుమార్, బ్రహ్మం, సంతోష్, కృష్ణంరాజు, ప్రేమ్, రజినీకార్, శ్రవణ్,కృష్ణ, కిషోర్, శరత్, అఖిల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## మహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గ మాత

**రాయపర్తి/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం మహాలక్ష్మి దేవి అవతారంలో దుర్గ మాత భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాలలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో దుర్గామాత కొలువుదీరగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముక్కులు చెల్లించుకుని నైవేద్యాలు సమర్పించి దీవెనలు పొందారు మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని విక్టరీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గ మాత ఉత్సవాలలో యూత్ సభ్యులు ఉపవాస దీక్షలు చేస్తూ మహాలక్ష్మి దేవి అవతారంలో ఉన్న దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో భక్తులు రామనారాయణ,గిరుక కేశవరెడ్డి,కళ్యాణ్,అభిషేక్, వినయ్,శ్రీశాంత్,శివానంద్, రామ్ చరణ్,పండు తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టికాహారం తీసుకోవాలి తోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది -సిడిపిఓ డేబోరా



**రాయపర్తి/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త):** పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వర్ధన్నపేట సీడీపీఓ డేబోరా అన్నారు. శుక్రవారం మండలంలోని సన్నూరు గ్రామంలో ని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి టీచర్ జహీదాబేగం అధ్యక్షతన పోషణ్ అభియాన్ వారోత్సవాలలో భాగంగ గర్భిణీలు, బాలింతలు, గర్భవతులకు అంగన్వాడి పిల్లలకు మండల స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి లో చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం, గర్భిణి స్త్రీలకు శ్రీమంతాలు చేయడం జరిగింది. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిడిపిఓ డెబోరా మాట్లాడుతూ పోషకాహార లోపం వల్లనే అనారోగ్యాలు ఏర్పడతాయని దీనిని నివారించడం కోసం ప్రతి గర్భిణి ,బాలింతలు, తల్లులు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాలలో అందించే పోషకాహారాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం అందించే గుడ్లు, పాలు, ఆకుకూరలు తీసుకొని ఆరోగ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మాధవి లత,అంగన్వాడీ టీచర్లు జహీదాబేగం, మంజుల, శ్రీలత, సునీత, జ్యోతి, యాకూబీ, భారతి, కృష్ణవేణి ,సంగీత, విజయ రాణి, చంద్రకల గర్భిణీలు, బాలింతలు, తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.